# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 13-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- పాలనలో మహిళల భాగస్వామ్యానికి పెద్దపీట వేయడం ద్వారా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నిరీక్షణకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలతో తెరపడనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.

- దేశవ్యాప్తంగా గృహ వినియోగ గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు.

- మారుతున్న ప్రపంచ ఔషధ రంగంలో భారత్ బలమైన స్థానం సంపాదించిందని కేంద్రమంత్రి జే.పీ. నడ్డా పేర్కొన్నారు.

- ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వర్షపాతం "సాధారణం కంటే తక్కువ"గా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.

- హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

==============================

భారత మహిళా శక్తి తన కృషి, ధైర్యం, ఆత్మ విశ్వాసంతో కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ఢిల్లీలో ఈరోజు నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళనం'లో ప్రధాని ప్రసంగించారు. భారత్ సరికొత్త చరిత్ర లిఖించడానికి అతి చేరువలో ఉందని, ఈ శతాబ్దంలో అతి పెద్ద నిర్ణయాల్లో ఒకదానిని భారత్ తీసుకోబోతోందని వెల్లడించారు. పాలనలో మహిళల భాగస్వామ్యానికి పెద్దపీట వేయడం ద్వారా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నిరీక్షణకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలతో తెరపడనుందని ప్రధానమంత్రి ప్రకటించారు. 21వ శతాబ్దం మహిళలదేనని, మహిళా రిజర్వేషన్ చట్టం అమలుతో చిరకాల స్వప్నాల సాకారంతో పాటు భవిష్యత్ సంకల్పాలు నెరవేరుతాయన్నారు. 2023లో నూతన పార్లమెంటు భవనంలో "నారీ శక్తి వందన్ అధినియం" ద్వారా

ప్రభుత్వం తొలి అడుగు వేసిందని.. అది సకాలంలో అమలు కావడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మహిళలకు రిజర్వేషన్ అవసరమని, వారి భాగస్వామ్యం వలన దేశ ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ఆయన ఉద్ఘాటించారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి రాజ్యాంగ నిర్మాణ సభ వరకు మహిళలు అందించిన సహకారం వెలకట్టలేనిదని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

==============================

దేశవ్యాప్తంగా గృహ వినియోగ గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, గృహ అవసరాలకు 100 శాతం నిరంతరాయంగా సరఫరా జరుగుతోందని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గ్యాస్ సిలిండర్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఓటీపీ (OTP) ఆధారిత పంపిణీ విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో సరఫరా గొలుసు దెబ్బతినకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుందని సుజాత శర్మ వివరిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

==============================

అంతర్జాతీయ ఫార్మా రంగంలో వస్తున్న పెను మార్పులకు అనుగుణంగా భారత్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా ఆశాభావం వ్యక్తం చేశారు. ఫిక్కీ (FICCI) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన 'ఇండియా ఫార్మా 2026' కార్యక్రమానికి వీడియో సందేశం పంపిన ఆయన... పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా విధానాలు రూపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. తక్కువ ధరకే నాణ్యమైన జనరిక్ మందులను అందిస్తూ భారత్ ఇప్పటికే 'ప్రపంచ ఔషధశాల' (Pharmacy of the World)గా గుర్తింపు పొందిందని ఆయన గుర్తు చేశారు.

==============================

పశ్చిమ బెంగాల్‌ను చొరబాటుదారులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లక్ష్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. పశ్చిమ వర్ధమాన్ జిల్లాలోని రాణిగంజ్‌లో ఈరోజు నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి వల్లే సరిహద్దు భద్రత సవాలుగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సరిహద్దు రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని అమిత్ షా ఆ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విరామం

==============================

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ నిరంతరం పరితపించారని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులను బలోపేతం చేయడంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని రాష్ట్రపతి తెలిపారు. ముఖ్యంగా మహిళల విద్య, వారి హక్కులకు ఆయన అత్యంత ప్రాధాన్యతనిచ్చారని గుర్తు చేశారు. బాబాసాహెబ్ అడుగుజాడల్లో నడుస్తూ.. నవ భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ద్వారా అందే వర్షపాతం "సాధారణం కంటే తక్కువ"గా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. న్యూఢిల్లీలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహపాత్ర మాట్లాడుతూ... ఈ సీజన్‌లో వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 92 శాతం మాత్రమే ఉండే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంపై బలహీనంగా ఉన్న `లా నినో` పరిస్థితులు రుతుపవన కాలం నాటికి `ఎల్-నినో`గా బలపడే అవకాశం ఉందని "మాన్‌సూన్ మిషన్ క్లైమేట్ ఫోర్కాస్ట్ సిస్టమ్" అంచనా వేసినట్లు ఆయన వివరించారు. దీని ప్రభావం వల్ల వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవచ్చని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణ  ప్రక్రియలో నిమగ్నమైన న్యాయాధికారులకు కల్పిస్తున్న భద్రతను అసెంబ్లీ ఎన్నికలు ముగిసే వరకు కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ముందస్తు అనుమతి లేకుండా ఈ భద్రతను ఉపసంహరించకూడదని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. ఏప్రిల్ 1న మాల్దాలో ఓటర్ల జాబితా పరిశీలనలో ఉన్న న్యాయాధికారులను ఒక అల్లరి మూక బందీలుగా ఉంచిన ఘటనను కోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న జాతీయ దర్యాప్తు సంస్థ (NIA)ను ధర్మాసనం కీలక వివరణ కోరింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ శాంతి స్థాపన కోసం భారత్, చైనా, రష్యా వంటి ప్రపంచ శక్తులు చేస్తున్న కృషిని ముంబైలోని ఇరాన్ కాన్సుల్ జనరల్ సయీద్ రెజా మొసయ్యబ్ మొత్లఘ్ కొనియాడారు. ముఖ్యంగా దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్న భారత్ నిబద్ధతను, సైనిక జోక్యానికి దూరంగా ఉండాలన్న నిర్ణయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఒక వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. అమెరికా తీసుకున్న చర్యలకు ఈ దేశాలు మద్దతు తెలపలేదని, ప్రపంచ మార్కెట్లను, పరిస్థితులను సుస్థిరీకరించేందుకే ఇవి మొగ్గు చూపాయని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఈరోజు న్యూఢిల్లీలో యూరోపియన్ పార్లమెంట్ సభ్యుడు మన్‌ఫ్రెడ్ వెబర్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంపై జైశంకర్ సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ.. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా ఆమోదించి, అమలులోకి తీసుకురావాలని నిర్ణయించామని పేర్కొన్నారు. అలాగే సింగపూర్, కువైట్ దేశాల విదేశీ వ్యవహారాల మంత్రులతో ఆయన టెలిఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో మాట్లాడిన జైశంకర్.. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, వాటి వల్ల అంతర్జాతీయంగా తలెత్తే పరిణామాలపై చర్చించారు. అనంతరం కువైట్ విదేశాంగ మంత్రి షేక్ జర్రా జబీర్ అల్-అహ్మద్ అల్-సబాతో ఫోన్ లో మాట్లాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్ లో భాగంగా హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ తొలుత బౌలింగ్

ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 12 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది.

==============================
==============================